## కూల్ డ్రింక్‌లో మత్తు ఇచ్చి అత్యాచారం

### ఆస్పత్రికి వెళ్లేందుకు ఆటోఎక్కిన మహిళపై అఘాయిత్యం

**ఘట్‌కేసర్ రూరల్, జులై 9, ప్రభాతవార్త:** ఆస్పత్రికి తీసుకెళ్లమని ప్యాసింజర్ ఆటో ఎక్కిన మహిళకు కల్లులో మత్తు మందు కలిపి ఇచ్చి అత్యాచారానికి పాల్పడిన ఆటోడ్రైవర్‌ను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ సీఐ కనకయ్య గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 8వ తేదిన ఉదయం పదిన్నర గంటలకు ఉప్పల్ భరత్ నగర్‌లో ఓ మహిళ ఆటో ఎక్కి ఆస్పత్రికి తీసుకుపొమ్మని చెప్పింది. దీంతో ఆటో డ్రైవర్ భరత్ నగర్‌లో గల తాటికల్లు డిపోకు తీసుకుపోయి అక్కడ కల్లు పార్సిల్ తీసుకుని ఘట్‌కేసర్ ఔటర్ రింగ్‌రోడ్డు నుండి ఆటోను దూరంగా తీసుకువెళ్లాడు. అక్కడ మహిళకు స్ప్రైట్ బాటిల్లో మత్తు పదార్థం కలిపి తాగించాడు. సదరు మహిళ స్పృహ కోల్పోయిన తర్వాత ఆటో డ్రైవర్ అత్యాచారం చేసి ఆమె వద్ద గల సెల్‌ఫోన్ కొంత నగదు తీసుకున్నాడు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త



సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం యూనిట్‌లోని ఉత్పత్తి విభాగాలను పరిశీలించి తయారీ ప్రక్రియపై సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

# తిన్నదంతా కక్కాల్సిందే



**తాండూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు రగడ స్థానిక నేతలకు పెద్ద తలనొప్పిగా మారింది. ఇళ్ల పంపిణీలో పారదర్శకత లోపించిందని, ధనికులకు ఇళ్లు కేటాయించారంటూ పేదలు ఆందోళనకు దిగారు. ఇదే సమయంలో ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించి లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడిన కౌన్సిలర్ల గుట్టు రట్టవడంతో, తక్షణమే ఆ డబ్బును బాధితులకు తిరిగి చెల్లించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశించడం పట్టణంలో తీవ్ర దుమారం రేపుతోంది.**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం భారీ ఎత్తున చేతులు మారినట్లు తెలుస్తోంది. ఈ తతంగం తాండూరు మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. ఒక్కో ఇంటికి రూ.లక్ష చొప్పున కొంతమంది కౌన్సిలర్లు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. తీరా లక్కీ డ్రాలో వారి పేర్లు గల్లంతు కావడంతో ఖంగు తిన్నారు. తిన్నదంతా వాపసు కక్కాల్సిన పరిస్థితి నెలకొంది. తమ డబ్బు తమకు వాపసు ఇవ్వాలంటూ పలువురు దరఖాస్తు దారులు వారిపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

**శివారులో 600 డబుల్ బెడ్ రూము ఇళ్లు**

తాండూరు పట్టణ శివారులో సుమారు 600 డబుల్ బెడ్ రూము ఇళ్లు నిర్మించారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించగా ఇప్పటికి పూర్తి చేశారు. తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై విలువైన ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించారు. ఎమ్మెల్యే బీ.మనోహర్‌రెడ్డి చొరవ తీసుకుని డబుల్‌బెడ్ రూముల కాలనీలో అంతర్గత రోడ్ల కోసం రూ.కోటి వెచ్చించారు. 90 శాతం పనులు పూర్తి చేశారు. ఇంకా పలు వసతులను కల్పించారు.

**10 వేలకుపైగా దరఖాస్తులు**

నాలుగేళ్ల క్రితమే డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం పట్టణంలోని అన్ని వార్డుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ 36 వార్డులు ఉండగా 10 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. కాంగ్రెస్ నాయకుడు తీసుకున్న నిర్ణయం తర్వాత పేదవర్గాల్లో ఆందోళన నెలకొంది. మూడు నెలల క్రితం కాంగ్రెస్ మైనార్టీ నేత ఒకరు మున్సిపల్ ఆఫీసులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లక్కీ లాటరీ తీశారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం కావడంతో పట్టణంలో తీవ్ర దుమారం రేగింది. స్వపక్ష, విపక్ష పార్టీల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది.

**స్థానిక కౌన్సిలర్ల వద్దకు క్యూ**

ఈ నేపథ్యంలో తమకు ఇళ్లు వస్తాయో రావో అనే అనుమానంతో కొత్తగా గెలుపొందిన కౌన్సిలర్లను ఆశ్రయించారు. ఇటీవల ప్రతి వార్డుకు 12 ఇళ్లు కేటాయిస్తారని ప్రచారం జరుగడంతో దరఖాస్తుదారులు స్థానిక కౌన్సిలర్ల వద్దకు క్యూ కట్టారు. ఇదే అదనుగా భావించిన కొంతమంది కౌన్సిలర్లు ఇంటికి లక్ష చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ఈ విషయం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వరకూ చేరడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరుగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ దీపక్ తివారీని కోరారు.

**సొమ్ము వెనక్కి ఇవ్వటానికి విముఖత**

10 రోజుల క్రితమే లక్కీ డ్రా తీశారు. అయితే, ఈసారి అర్హులైన పేదవారికి కాకుండా ధనికులు, ఇళ్లున్న వారు ఎంపికయ్యారు. అంతేకాకుండా కౌన్సిలర్లకు డబ్బులు సమర్పించుకున్న వారి పేర్లు గల్లంతయ్యాయి. దాంతో పేదవర్గాల్లో మరోసారి ఆగ్రహం, ఆందోళన పెల్లుబికింది. వారిని సముదాయించేందుకు పలువురు కౌన్సిలర్లు నానా తంటాలు పడుతున్నారు. అనర్హులను తొలగించి వారి స్థానంలో అర్హులకే ఇళ్లు వచ్చేలా చేస్తామని చెబుతున్నా శాంతించడం లేదు. డబ్బులు ఇచ్చిన వారికి తిరిగి చెల్లించేందుకు కొంతమంది కౌన్సిలర్లు విముఖంగా ఉన్నారు. ఏదేమైనా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వ్యవహారం నేతలకు తలనొప్పిగా మారింది.



డ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అసిస్టెంట్ కలెక్టర్, మున్సిపల్ ఛైర్పర్సన్ (ఫైల్)

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో చేతివాటంపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సీరియస్

**కొంతమంది కౌన్సిలర్లు ఇంటికి రూ.లక్ష వసూలు చేశారని బాధితుల ఆరోపణ**

**సొమ్ము చెల్లించినా లక్కీడ్రాలో పేర్లు గల్లంతయ్యాయని ఆగ్రహం**

**డబ్బు వాపస్ ఇవ్వాలని ఒత్తిడి**

**డబ్బు వసూలు చేయడం దుర్మార్గం : ఎమ్మెల్యే**

అర్హులకే ఇండ్లు అందుతాయని తాండూరు ఎమ్మెల్యే బీ.మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. కౌన్సిలర్లు డబ్బులు తీసుకున్నట్లయితే వెంటనే సదరు పేదలకు వాపసు ఇవ్వాలని సూచించారు. డబ్బు వసూలు చేయడం దుర్మార్గమమని మండిపడ్డారు. తీసుకున్న వారు వెంటనే పేదలకు వాపసు ఇవ్వాలని సూచించారు. పగడ్బందీగా, అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని ఆయన తెలిపారు.

### క్లీన్ ఎనర్జీ రంగంలో

# గ్లోబల్ హబ్

**పునరుత్పాదక ఇంధన రంగానికి పెద్దపీట**

**2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల తెలంగాణ**

**సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవ సభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**చేవెళ్ల, జులై 9, ప్రభాతవార్త :** తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ భారీ పెట్టుబడితో ఏర్పాటు చేసిన అత్యాధునిక సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను గురువారం సిఎం రెంత్‌రెడ్డి ప్రారంబించారు. అనంతరం యూనిట్‌లోని ఉత్పత్తి విభాగాలను పరిశీలించి తయారీ ప్రక్రియపై సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

**పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా తెలంగాణ ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ కేవలం 12 నెలల్లో 75 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక తయారీ యూనిట్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు.

ప్రాజెక్టు ఏర్పాటుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేశాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన రంగానికి డిమాండ్ పెరుగుతున్న పేపథ్యంలో తెలంగాణలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామన్నారు. నూతన ఇంధన విధానం ఓపెన్ యాక్సెస్ పాలసీ వివిధ ప్రోత్సాహకాలు, సబ్సిడీల ద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకిర్షిస్తున్నామన్నారు. జహి రాబాద్‌లో జాతీయ పారిశ్రామిక తయారీ మండల ఏర్పాటు స్వచ్ఛ ఇంధన రంగ అభివృద్ధి ఆధునిక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, ఇన్నోవేషన్, సుస్థిర అభివృద్ధికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రిమియర్ ఎనర్జీస్ సంస్థ యాజమాన్యాన్ని అభినందిస్తూ రాష్ట్ర పారిశ్రామికభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామక్రిష్ణారావు, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్‌రెడ్డి, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జంగ్గారెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీంభత్, కలెక్టర్ నారాయణరెడ్డి, ముడిమ్యాల సహకారం సంఘం ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, సర్పంచ్ రాంచంద్రయ్య, గోనే శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్‌లు గోపాల్‌రెడ్డి, మంగళి కల్యాణీ యాదగిరి, బండారి శైలజ అడిరెడ్డి, షాబాద్ మార్కెట్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు తదితులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

### ప్రతి పంచాయతీకి

## ఆరుగురు మాస్టర్ ట్రైనర్లు

**గ్రామాల అభివృద్ధిపై అవగాహన పెంచటమే లక్ష్యం : కలెక్టర్ దీపక్ తివారీ**

**వికారాబాద్, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మూడు సంవత్సరాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించనున్నట్లు వివరించారు. గ్రామాల్లోని జనాభా, ప్రాథమిక ఆరోగ్య, అంగన్వాడి కేంద్రాల వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయవలసి ఉంటుందని తెలిపారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధికి ఆరుగురు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరి సూచనల మేరకు గ్రామాల అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని దీన్ని దృష్టిలో పెట్టుకొని జంతు జనన నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్న క్రమంలో జలసిరి పథకం ద్వారా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరిలో ఊట కుంటలను లను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వర్షాభావ పంటలు, తక్కువ నీటితో సాగు చేసే పంటలు వేసే విధంగా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు ఆయిల్ ఫామ్ ను సాగుచేసేందుకు ప్రోత్సహించాలని ఇట్టి పంటకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తుందనే విషయాన్ని రైతులకు తెలియచేయాలని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామపంచాయతీ ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధుల కంటే అధికంగా ఖర్చు చేయకూడదని ఆయన సూచించారు. గ్రామాల్లో వీధి దీపాలు సమకూర్చుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీలలో విద్యుత్తు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని అధిగమించేందుకు సోలార్ సిస్టంను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ, వ్యర్థాలను వేరుచేసి ఇద్దాం.. మన గ్రామాలను స్వచ్ఛందంగా మార్చుకుందాం అనే గోడ ప్రతిని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుధీర్, డిపిఓ జయసుధ, డీఆర్డిఓ శ్రీనివాస్, అడిషనల్ డిఆర్డిఓ సత్తయ్య, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 20 లోపు డిజటలైజేషన్ పూర్తి చేయాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలో జూలై 20 లోపు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం ప్రత్యేక సమగ్ర సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియపై ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, బిఎల్ఓ సూపర్వైజర్లతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 12 శాతం ప్రత్యేక సమగ్ర సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు.

జిల్లాలోని 4 నియోజక వర్గాల్లో 10,17,671 ఓటర్లకు గాను 1,20,775 ఓటర్ల డిజిటలైజేషన్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు తప్పని సరిగా 10 శాతం డిజిటలైజేషన్ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు ఐకెపి ఎపిఎం, ఫీల్డ్ అసిస్టెంట్లు, విఓఏ, బిఎల్‌ఏల సహకారం తీసుకోవాలని ఆయన తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, డిఆర్ఓ స్వర్ణలత, డిఆర్డిఓ శ్రీనివాస్, బిడబ్ల్యుఓ కాంతారావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ, వికారాబాద్, కొడంగల్ తహసిల్దార్లు బి.లక్ష్మీనారాయణ, పి.రాంబాబు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ ప్రతిష్ట పెంచండి

**అధికారులకు డిఐజి పిలుపు**

**వికారాబాద్, ప్రభాతవార్త :** చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న డీఐజీకి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి, ఇటీవల పునరుద్ధరించిన ఎస్పీ ఛాంబర్‌ను డీఐజీ ప్రారంభించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ విభాగాలైన డీపీఓ సెక్షన్లు, డీసీఆర్‌బీ, డీఎస్‌బీ, డీఏఆర్, పరిపాలనా శాఖలు, రికార్డు విభాగాలు, ఆయుధాగారం, సిబ్బంది నిర్వహణకు సంబంధించిన విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయా శాఖల్లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నిర్వహణ, పరిపాలనా విధానాలు, ఫైళ్ల నిర్వహణ, సేవా రికార్డులు, కార్యాలయ నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, ఫైళ్ల భద్రపరచడం, పరిపాలనా విధానాలు సక్రమంగా ఉండటం ప్రతి పోలీసు అధికారికి ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి శాఖలో రిజిస్టర్లు, రికార్డులు, కేసుల సంబంధిత ఫైళ్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అన్నారు. కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, పరిశుభ్రత, సమయపాలనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.



ఎస్పీ చాంబర్‌ను ప్రారంభిస్తున్న డిఐజి ఎల్.ఎస్.చౌహాన్

ప్రజలకు సంబంధించిన వినతులు, ఫిర్యా దులను జాప్యం లేకుండా సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కార్యాలయ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని సూచిం చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచాలని. ప్రభుత్వ మార్గద ర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా ప్రతి అధికారి తన బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, జిల్లా డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్, డిఎస్‌పి వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.



## రేపు చెత్త లారీల బంద్

**నేటి నుంచి 20 వరకు చైతన్య పాదయాత్రలు**

**డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జెసి తీర్మానం**

**జవహర్‌నగర్, జులై 9, ప్రభాతవార్త:** జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 11న చేపట్టనున్న చెత్త లారీల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి పిలుపు నిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్‌నగర్ ప్రగతి నగర్‌లోని నీలం రామచంద్రయ్య భవన్‌లో గురువారం నిర్వ హించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రాష్ట్ర ప్రభు త్వం హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత11 సంవత్సరాలు డంపింగ్ యార్డ్ కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. యాంటీ డంపింగ్ యార్డ్ దమ్మాయిగూడ జేఏసీ నేతలు, స్థానిక ప్రజలు సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేసి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న చేపట్టేచెత్త లారీల బంద్ కార్యక్రమం పూర్తిగా శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తామని చెప్పా రు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా మద్దతు తెలపాలని కోరారు. అలాగే డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 10 నుంచి 20 వరకు వివిధ కాలనీల్లో చైతన్య పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శాంతినగర్, గబ్బిలాలపేట, గాంధీనగర్, భాగ్యనగర్ కాలనీ, ప్రగతి నగర్, బీజేఆర్ నగర్, అంబేద్కర్ నగర్, కార్మిక్ నగర్, మల్కారం, శివాజీ నగర్, వికలాంగుల కాలనీ, లెప్రసీ కాలనీ, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఈ పాదయాత్రలు కొనసాగ నున్నట్లు వివరించారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారులు నరసింహ గౌడ్, తోటపల్లి శంకర్, అనురాధ, ప్రవీణ్, పెరక సునీత, శివబాబు తదితరులు పాల్గొన్నారు.

# రోజూ న్యూస్ పేపర్ చదవాలి

**పదిమందిలో మాట్లాడితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది- కౌకూరు విద్యార్థులకు కలెక్టర్ హితబోధ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 9, ప్రభాతవార్త :** విద్యార్థులు ప్రతి రోజు దినచర్యలో భాగంగా న్యూస్‌పేపర్లు చదవాలని, విద్యార్థులు మీకు వచ్చిన బాషలో స్టేజిపై మాట్లాడితే ఆత్మ విశ్వాసం పెరుగుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా అల్వాల్ మండలంలోని కౌకూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి కలెక్టర్ అల్పాహారం (బ్రేక్ ఫాస్ట్) చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రతి రోజు న్యూస్‌పేపర్ చదివితే అదొక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు స్టేజి ఫేయర్ లేకుండా మీకొచ్చిన భాషలోనే స్టేజ్‌పై మాట్లాడితే ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. పాఠశాలలో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, సౌకర్యాలు ఎలా ఉన్నాయని హెచ్‌ఎం మురళికృష్ణను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అద నపు గదులు అవసరమని కలెక్టర్‌కు వివరించారు. అవసరమైన మౌళికవసతులు టాయిలెట్లు, తరగతి గదులు వంటి వాటి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, లైబ్రరీ తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కోరిన స్పోర్ట్స్ సామాగ్రిని అందిస్తానని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఓ రేణుకాదేవి, అల్వాల్ తహసీల్దార్ రాములు, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌకూరు హైస్కూల్‌లో విద్యార్థులతోపాటు అల్పాహారం తీసుకుంటున్న కలెక్టర్

## మేడ్చల్ కొత్త వైద్యాధికారిగా ఆనంద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 9, ప్రభాతవార్త :** మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా నూతన వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కె.ఆనంద్ కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ముందుగా డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత జిల్లా కలెక్టర్ మనుచౌదరిని, జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్‌ను, విజయేందర్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ హాస్పిటల్‌లో సివిల్ సర్జన్, ఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.ఆనంద్‌ను మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నూతన డిఎంఅండ్‌హెచ్‌ఓగా (ఇన్‌చార్జి)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ సి.ఉమాగౌరిని ప్రజా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ డైరక్టరేట్ హైదరాబాద్ కార్యాలయంలో వెంటనే రిపోర్టు చేయాలని బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో గురువారం ఆమె డైరక్టర్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీస్‌కు రిపోర్టు చేయటానికి వెళ్లినట్లు సంబంధిత అధికారుల నుంచి సమాచారం. మరోవైపు డాక్టర్ కె.ఆనంద్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్యసేవలను అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో అమలులో ఉన్న ప్రజా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు అయ్యేలా చూస్తానన్నారు.



# మద్యం బెల్టుషాపులను తొలగించాలని ఫిర్యాదు

-తాగుడుకు బానిసవుతున్న యువకులు

**ఘట్‌కేసర్, జులై 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపులను తొలగించాలని బిజెపి నాయకులు చిలకమర్రి మహేశ్ గురువారం ఘట్‌కేసర్ ఎక్సైజ్, మద్యనిషేధం అధికారులకు ఫిర్యాదు చేశారు. అవుషాపూర్‌లో గత 10 సంవత్సరాలుగా అక్రమంగా మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తుండటంతో చాలా మంది నిత్యం మద్యం తాగుతూ తమ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద కుటుంబంలో మద్యం చిచ్చుపెడుతుందని నిత్యం పలు ఇళ్లలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. యువకులు అర్ధరాత్రి దాకా మద్యం మత్తులో ఉంటూ స్థానికంగా వచ్చి పోయే బాటసారులు, పాదచారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా మద్యం తాగుతూ వివిధ అనారోగ్య కారణాలతో చాలా మంది చనిపోయారని తెలిపారు. అవుషాపూర్‌లో 24 గంటల పాటు బెల్టు షాపుల్లో మద్యం అమ్ముతున్నారని నామమాత్రం పోలీసులు కేసు పెట్టినప్పటికి తిరిగి విక్రయాలు నిరాటంకంగా జరుగుతూనే ఉన్నాయని ఇకనైనా



ఎక్సైజ్ ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న మహేశ్ తదితరులు

బెల్టుషాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మహేశ్ ఎక్సైజ్ ఎస్ఐకి విజ్ఞప్తి చేశారు. అవుషాపూర్‌లో గడిల సాములుగౌడ్, ఎరుకల నరేందర్‌గౌడ్, డొంకెని వెంకటేశ్‌గౌడ్, విజయలక్ష్మిలు మద్యం బెల్టు షాపులను నిర్వహిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# బాధిత మహిళలకు అండగా ఉంటాం

**బేగంపేట, జులై 9, ప్రభాతవార్త:** బాధింపబడే మహిళలకు అండగా ఉంటామని తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి భరోసానిచ్చారు. గురువారం జాతీయ మహిళా కమిషన్, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మల్టీజోన్ ఫేస్ 2 ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్‌జిల్లాల సఖీ సెంటర్ల సిబ్బంది, పోలీసు, లీగల్ రిప్రజెంటేటివ్ లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని వెంగళరావ్ నగర్‌లోని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ సంస్థ భవనాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గద్వాల విజయలక్ష్మి ప్రారంభించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతిఓజా, కమిషన్ సభ్యులు, కార్యదర్శి సిబ్బంది ఛైర్మన్ విజయలక్ష్మికి స్వాగతం పలికారు. రాష్ట్రంలో నలుమూలలకు మహిళా కమిషన్ సేవలను అందుబాటులోకి తీసికెళ్లేందుకు కృషిచేస్తామన్నారు. శిక్షణతోనే రక్షణ వస్తుందని, రక్షణతోనే కుటుంబం సమాజం పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్విని

తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి



సఖీ, పోలీస్ లీగ్ రిప్రజెంటేటివ్‌లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గద్వాల విజయలక్ష్మి

యోగం చేసుకుని మహిళలకు మరింత సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సభ్యులు కాసోజు శంకరమ్మ, శశికళయాదవ్‌రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయ్, ఉజ్మా ఆషయ్‌షాకీర్, కార్యదర్శి పద్మజ రమణ, సైకాలజిస్ట్ గీతా చల్లా, హైదరాబాద్ లా కాలేజ్ ప్రొఫెసర్ డా. పులిపాటి శ్రీదేవి, డీఎస్పీ చరితారెడ్డి, డిఎస్ఎల్ఏ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, కమిషన్ సిబ్బంది, సంబంధిత జిల్లాల సఖీ సెంటర్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా నిలచిన సిఎం రేవంత్ రెడ్డి

**తలకొండపల్లి జులై9,ప్రభాత వార్త;** రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, గట్టుప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, ఎదుల శంకర్ (శ్రీకాంత్) మిడ్జిల్ బహిరంగ సభలో అస్వస్థతకు గురై దురదృష్టవశాత్తు తర్వాతి రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి రాగానే కార్యకర్త కుటుంబానికి పార్టీకి అండగా నిలవాలని వారి కుటుంబాన్ని కలిసి ధైర్యాన్ని ఇవ్వాలని మంత్రి పొంగులేటి గారికి సూచించారు.,

ముఖ్యమంత్రి ఆదేశానుసారం వనపర్తి జిల్లా పర్యటన ముగించుకుని వస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి , శంకర్ (శ్రీకాంత్) స్వగ్రామం అయిన గట్టుప్పలపల్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి, శంకర్ (శ్రీకాంత్)గారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి తక్షణ సాయంగా రూ. 5 లక్షల చెక్కును కుటుంబసభ్యులకు అందించారు. భవిష్యత్‌లో ఆ కుటుంబానికి కావాల్సిన



ఏ విషయంలోనైనా, అన్నివేళల అండగా ఉండేలా కాంగ్రెస్ పార్టీ ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటుదని, మంత్రులు కుటుంబసభ్యులకు మనో ధైర్యాన్నిచ్చారు. ఈ కార్య క్రమంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, శంకర్ (శ్రీకాంత్) అభిమానులు మరియు గ్రామ ప్రజలందరు బాధాతప్తహృదయంతో పాల్గొన్నారు.

# శస్త్రచికిత్సలో ప్రాయోగిక నైపుణ్యాలను అలవర్చుకోవాలి

**అత్తాపూర్ జులై 9, ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ లోని పి.వి.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం, పశువైద్య కళాశాల, పశువైద్య శస్త్ర చికిత్స, రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి - షెడ్యూల్ కాస్ట్ సబ్ ప్లాన్ (ఐసీఏఆర్-ఎస్‌సీ ఎస్‌పీ) ఆర్థిక సహకారంతో "చివరి సంవత్సరం బి.వి.ఎస్సీ ఏహెచ్ షెడ్యూల్ కాస్ట్ విద్యార్థులకు మరియు క్షేత్ర పశువైద్యులకు కంపానియన్ జంతువుల ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సల్లో జ్ఞాన, నైపుణ్యాభివృద్ధి ద్వారా జీవనోపాధి, ప్రోత్సాహకాభివృద్ధి" అనే అంశంపై ఐదు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం మొదటి శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. పి.వి.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొ. జ్ఞానప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో పశువైద్య విద్యార్థులు పాఠ్యాంశ పరిజ్ఞానంతో పాటు శస్త్రచికిత్సల్లో ప్రాయోగిక నైపుణ్యాలను కూడా తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు. కంపానియన్ జంతువుల వైద్యంలో పెరుగుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు స్వయం ఉపాధి దిశగా కూడా ముందుకు సాగాలని, ఇటువంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్తులో ఉత్తమ పశువైద్య నిపుణులుగా తీర్చి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పశువైద్య విశ్వవిద్యాలయంలో అధికారులు, విద్యార్థులు

దిద్దడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పి.వి.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ డా. ఎం.ఉదయ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవడం ద్వారా సమర్థవంతమైన పశువైద్య నిపుణులుగా ఎదగగలరని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా. డి.మాధురి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రాయోగిక శిక్షణ అందించడం విశ్వవిద్యాలయం ప్రధాన లక్ష్యమన్నారు. శిక్షణా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జె. రాధాకృష్ణారావు స్వాగతోపన్యాసంలో మాట్లాడుతూ, కంపానియన్ జంతువులలో ఆర్థోపెడిక్ సమస్యలను గుర్తించడం, నిర్వహించడం మరియు శస్త్రచికిత్సా పద్ధతులపై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ఆధునిక శస్త్ర చికిత్సా విధానాలు, క్లినికల్ నైపుణ్యాలు మరియు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, 21 మంది చివరి సంవత్సరం బివిఎస్సీ ఏహెచ్ విద్యార్థులు పాల్గొన్నారు.



శామీర్‌పేట డివిజన్-300పరిధిలో ఎస్ఐఆర్ పత్రాలను అందజేస్తున్న ఏఎంసి మధుసూదన్‌రెడ్డి మాజీ జడ్పీటిసి సభ్యులు ఎం.అనితలాలయ్యకు అందజేస్తున్న దృశ్యం

# ఎస్ఐఆర్ ఫారాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నింపాలి

**శామీర్‌పేట, జులై 9, ప్రభాతవార్త:**

ఎస్ఐఆర్ ఫారాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సక్రమంగా నింపి ఇవ్వాలని, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, కీసర ఏఎంసి మధుసూదన్‌రెడ్డిలు సూచించారు. గురువారం శామీర్‌పేట డివిజన్-300పరిధిలో ఎస్ఐఆర్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలు అందరు కూడ ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాలు నింపి తిరిగి బిఎల్ఓలకు ఇవ్వాలని సూచించారు. దీనిలో ప్రజలు అందరు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఫౌరుడు ఎస్ఐఆర్ ఫారాన్ని సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని దీని వల్ల ప్రభుత్వ సేవలు, పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు బిఎల్ఓ రాంరెడ్డి, బాలు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకోవాలి

## ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** ఉన్నత విద్యతో పాటు ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకొని ప్రతి విద్యార్థి ఆ లక్ష్యసాధనకోసం కృషిచేసినప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటే షిన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ ప్రొగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ... సృజనాత్మకతను పెంచుకున్నవారికి మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మితిమీరిన సెల్ఫోన్ ఉపయోగం వల్ల సమయం వృధాకావడంతోపాటు మన ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతుందని చెప్పారు. ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధా (ఏఐ) సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆ దిశగా తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంప్రదాయ విద్యతో పాటు అడ్వాన్స్ స్కిల్ నేర్చుకోవడం ఎంతో అవసరం అన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కొత్త సాంకేతికత పై పరిజ్ఞానం, కమ్యూనికేషన్, డిజిటల్ నైపుణ్యం వంటి అంశాలలో ప్రావిణ్యం సాధిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎం. ప్రియాంకా, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రావు, డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ ఎస్ అప్పారావు, ఐసిఏఐ చైర్మన్ డి.వెంకటరాంబాబు, హెచ్ఆర్ డైరెక్టర్ గరిమా పాండే, బ్రహ్మకుమారిస్ డాక్టర్ బీకే శ్రీలత సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**నిజాంపేట, జులై 9, ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్‌లో ఎఐటియుసి మండల 4వ మహాసభ ఆసి యాదయ్య అధ్యక్షతన నిజాంపేట్ ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిం చారు. మహాసభకు మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర మున్సిపల్ సంఘం కార్యదర్శి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యేసురత్నం, ఎఐటియుసి ఉపా ధ్యక్షుడు పాలబిందల శ్రీనివాస్, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షుడు హరినాథరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే కార్మి కులు పోరాటాలద్వారా సాధించుకున్న కార్మిక చట్టా లను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల రూపంలో బలహీనపరిచిందని విమర్శించారు. కార్మిక సం ఘాల హక్కులను తగ్గించే విధంగా, యాజమాన్యా లతో కార్మిక సంఘాల చర్చలకు అవకాశం లేకుండా చేసే విధానాలు అమలుచేస్తున్నారని ఆరోపించారు. అలాగే స్థిర ఉద్యోగాలకు బదులుగా కాలపరిమితి ఉద్యోగ విధానాలను తీసుకువచ్చి కార్మికుల భద్రతను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల తరఫున మాట్లాడే సంఘాలను బలహీనపరచేందుకు కుట్రపూరిత రాజకీయాలు సాగుతున్నాయని, కనీస వేతనం రూ.26 వేలుగా చెల్లించా లని సుప్రీంకోర్టు సూచించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో కార్మికులందరూ ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 11న మేడ్చల్ జిల్లాలో జరిగే ఎఐటియుసి 4వ జిల్లా మహాసభలో భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేసి, కార్మికు లకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలను కొనసా గిస్తామని నాయకులు తెలిపారు. ఈ మహాసభలో దస్తగిరి, భాగ్యమ్మ, పుష్ప, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిజాంపేట్ ఎఐటియుసి అధ్యక్షుడిగా మేకల బాలకృష్ణ, మండల కార్యదర్శి గా ఆసియాదయ్య, కన్వీనర్‌గా దస్తగిరిని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.

# వార్డ్ మెంబర్ ఇంట్లో ..నల్లాత్రాచు కలకలం

భయాందోళనతో పరుగులు తీసిన కుటుంబ సభ్యులు



కలకలం సృష్టించిన నల్లత్రాచు పాము



జెసిబితో పిచ్చి మొక్కలను తొలగింప చేస్తున్న నాయకులు

**నందిగామ జులై 9 ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో 9 వ వార్డ్ సభ్యురాలు కుమ్మరి శ్రీలత సురేష్ ఇంట్లో నల్లత్రాచు పాము కలకలం రేపింది. మధ్యాహ్నం వేళలో పాము ఇంట్లోకి దూరడాని గమనించిన కుటుంబ సభ్యులు అప్రమత్తమై భయంతో వెంటనే బయటకు వచ్చారు. ఈ సంఘటనపై సర్పంచ్ కొమ్ము కృష్ణ కు సమాచారం అందించడంతో హుటాహుటిన ఆయన తొమ్మిదవ వార్డ్‌కు వచ్చి పారిశుద్ధ్య సిబ్బంది చేత నల్ల త్రాచును చంపేసి జెసిబి సహాయంతో ఇంటి పరిసర ప్రాంతాలలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలం రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు శివగల్లసురేష్, టైలర్ కృష్ణ, వార్డ్ మెంబర్ భర్త సురేష్, నాయకులు గంగిశెట్టి శ్రీశైలం, మోర్స్ శ్రీను తదితరులు ఉన్నారు.

# పద్మశ్రీలతో పరిఢవిల్లిన తెలంగాణ ప్రజాకళ

**రవీంద్రభారతి, జులై 9, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృ త్వంలో జరుగుతున్న సాంస్కృతిక కళామహోత్సవం తెలంగాణ ప్రజాకళ 99వ రోజు తెలంగాణ పద్మశ్రీ కళాకారులతో పరిఢవిల్లింది. అంతరించి పోతున్న అరుదైన జానపద కళలను తమ గుండెల్లో నింపుకుని దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మశ్రీని అందుకున్న ముగ్గురు తెలంగాణ కళామూర్తులు దాసరి కొండప్ప బుర్ర వీణానాదం; దర్శనం మొగులయ్య 12మెట్ల కిన్నెర; గడ్డం సమ్మయ్య చిందుయక్షగానంతో రవీంద్రభారతి పాల్కురికి సోమన్న వేదిక పునీతమైంది. నారాయణపేట జిల్లాకు చెందిన పద్మశ్రీ దాసరి కొండప్ప స్వయంగా తయారుచేసిన అరుదైన బుర్రవీణ వాయిద్యం తత్వాలు, జానపద గేయాలను వేళ్ల విన్యాసం, వీణ మధుర నాదంతో పరవశింపజేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పద్మశ్రీ దర్శ నం మొగులయ్య తన సంప్రదాయ 12మెట్ల కిన్నెర వాయిద్యంతో పాడిన వీరుల గాథలు, జానపద గీతాలు సరికొత్త ఉత్సాహంతో నింపగా జనగామ జిల్లాకు చెందిన చిందుయక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య తన బృందంతో కలిసి చిందుయక్షగాన ప్రదర్శన పౌరాణిక పాత్రల్లో వారు పలికించిన హావభావాలు, నృత్యాలు, సంభాషణలు రంగస్థలానికే వన్నెతెస్తూ మైమరపించాయి. ఈ సందర్భంగా ముగ్గురు పద్మశ్రీ కళాకారు లను ఘనంగా సత్కరించారు.

# ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేయించుకోవాలి

## బిఆర్ఎస్ నాయకురాలు గంగిశెట్టి లిఖితగౌడ్

**హైదరాబాద్ జులై 9, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును పదిలంగా ఉంచుకోవడంలో సర్ నమోదుప్రక్రియ అత్యంత కీలకమని, ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ అన్నారు. గురువారం నల్లకుంటలోని తన నివాసంలో ఆమె తన భర్త గంగిశెట్టి అమర్‌నాథ్‌గౌడ్ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, ప్రజాస్వామ్య హక్కును కాపాడుకోవాలని సూచించారు. ఇంటింటికి వచ్చి బిఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడం జరుగుతుందని, ఓటర్లు తప్పులు లేకుండా ఫారం లో తమ వివరాలను ఓటర్లు రాయాలని సూచించారు. ఈనెల 24వ తేదీ లోపు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి తిరిగి బి ఎల్ వో లకు అందజేయాలన్నారు. సర్ 2002లో ఓటు ఉన్నవారు మొదటి బాక్సు కాలమ్ లో నింపాలని ఆమె సూచించారు. 2002లో ఓటు లేనివారు వారి తండ్రి, తల్లి, తాత, నాయనమ్మల్లో ఒకరిది ఎస్ఐఆర్2002 వివరాలను రెండో బాక్సు కాలమ్ లో,ఈ రెండూ తెలియని వారు మూడో బాక్సు కాలమ్ పూరించాలని తెలిపారు. అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు ఓటర్ల కోసం నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ లోని బస్తీలు, కాలనీలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ హెల్ప్ డెస్కులలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రజలకు సర్ ఫారాలను నింపడంలో సహాయం చేస్తున్నారని ఆమె తెలిపారు.

# ప్రజా సమస్యలపై టిడిపి సమర శంఖం

**చిక్కడపల్లి జూలై 9 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని బలో పేతం చేయడమే లక్ష్యంగా ముషీరాబాద్ నియోజక వర్గం రాంనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని శ్రీవెంక టేశ్వరస్వామి దేవాలయం వద్ద 'తెలుగుదేశం-ప్రజా పథం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభిం చారు. మాజీ కార్పొరేటర్ పి.బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో, రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు డి.చంద్రమోహన్‌గౌడ్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, సికింద్రాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నల్లెల్ల కిషోర్, నాయకులు పి.అశోక్, జి.వి.జి.నాయుడు ముఖ్యఅతిథులుగా హాజర య్యారు. కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నా,లేకున్నా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్య మవుతుందని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టా లని నల్లెల్ల కిషోర్ డిమాండ్ చేశారు.పి.బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజాపథం లో భాగంగా రాంనగర్, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లో పర్యటించగా డ్రైనేజీ లైన్లు, ధ్వంసమైన సీసీ, బీటీ రోడ్లు, తీవ్ర నీటి ఎద్దడి, కరెంట్ కోతలు వంటి సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటి పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. టీడీపీ విధానాలకు ఆకర్షితులై ఐదుగురు యువకులు పార్టీలో చేరగా, వారికి నేతలు పసుపు కండు వాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కె. బోసు, జి.వి.జి.నాయుడు, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ , డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్ గుప్తా, ఎం.చిత్ర, గండికోట విజయ్, మశ్చీందర్, బి. రాజు, రవి, సత్తన్న, భవాని శ్రీనివాస్, ఆనంద్, అనిల్, శక్తి ప్రేమ్, కాతా విజయ్, విక్రం, మల్లిఖార్జున్, యాదగిరి, ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న సుదర్శన్‌రెడ్డికి ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

# ఘనంగా శ్రీవిజయ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**ఘట్‌కేసర్, జులై 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ వేమనానగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవిజయ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 16వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ఉదయం నుంచే హోమం, ఉత్సవ మూర్తులకు అభిషేకం తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. ఆలయం నిర్మించి 16 సంవత్సరాలు కావడంతో అర్చకులు, ఆలయ నిర్వహకులు అమ్మవార్లకు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పూలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి విచ్చేసి స్వామిని దర్శించుకొని పూజలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించి సన్మానంతో తీర్థప్రసాదాలు అందజేశారు. ఆధ్యాత్మిక, ధార్మిక, సాంప్రదాయ కార్యక్రమాలతో సమూజంలో ఐక్యత, భక్తిభావం పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి వార్షికోత్సవ పూజల్లో పాల్గొని వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

# రమాసహిత సత్యనారాయణస్వామి వార్షికోత్సవ పూజలు

**ఘట్‌కేసర్, జులై 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ మాదారంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి, గణపతి, అభయాంజనేయ, నవగ్రహ, గరుడస్వామి దేవాలయంలో 8వ వార్షికోత్స పూజలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 7న నుంచి జరుగుతున్న ఉత్సవాలలో వేదపండితుల మంత్రోచ్చారణాలతో విఘ్నేశ్వరస్వామి పూజ, పంచగవ్య ప్రాసన, మండపారాధాన, అగ్నిప్రతిష్ట, పంచామృత అభిషేకం, హవనం జరుగగా గురువారం అవాహిత మండపారాధన శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం, పూర్ణాహుతి, బలిహరణం, మహదాశీర్వచనం, ఋత్విక్ సన్మానం నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య ఉత్సవ మూర్తులకు కళ్యాణం జరిపించగా పలువురు దంపతులు స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించుకున్నారు. ఘట్‌కేసర్ ప్రముఖ వ్యాపారి కృష్ణ దంపతులు, వారి కుటుంబసభ్యులు ఇక్కడ ఆలయం నిర్మించి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలను ఘనంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నప్రసాద వితరణ చేశారు. ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని కళ్యాణంలో పాల్గొన్నారు.



సత్యనారాయణస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

# జోనల్ సత్యనారాయణ బృందానికి సన్మానం

**చాంద్రాయణగుట్ట, జులై 9, ప్రభాతవార్త:**

బోనాల ఏర్పాట్లలో భాగంగా గురువారం గౌలిపురా శ్రీ మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం, శ్రీ కోటమైసమ్మ దేవాలయాలను జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ, డిసి సరిత బృందం సందర్శించారు. ఆలయ అధ్యక్షులు ఎర్మని కైలాష్ గంగపుత్రవారికి ఘనస్వాగతం పలికారు. శాలువతో సన్మానిం చారు. బోనాల సందర్భంగా ఆల యాల వద్ద చేపట్టాల్సిన పనులను జెడ్సి, డిసిల దృష్టికి తీసుకువెళ్ళారు. అందుకు స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శులు అల్లి మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్ తదితరులున్నారు.

# ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అంతర్జాతీయ గౌరవం

**జూబ్లీహిల్స్, జులై 9, ప్రభాతవార్త:** అంధత్వ నివారణలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల(ఎల్వీపీఈఐ)కు అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ఈ సంస్థను మరో నాలుగేళ్ల కాలానికి తన అధికారిక కోలాబరేటింగ్ సెంటర్‌గా తిరిగి ఎంపిక చేసుకున్నట్లు ఎల్వీపీఈఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు తెలిపారు. తొలిసారిగా 2001లో ఈ గుర్తింపు సాధించి పాతికేళ్లుగా ఈ హోదాను కొనసాగిస్తున్నామన్నారు. డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ గుర్తించిన పదకొండు అత్యుత్తమ కంటి సంరక్షణ సంస్థలలో ఎల్వీపీఈఐ ఒకటిగా నిలవడం గర్వకారణమన్నారు. ఇది అత్యంత అరుదైన గౌరవమని, ఇందులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందన్నారు. ఆసుపత్రి పబ్లిక్ హెల్త్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్ ఖన్నా మాట్లాడుతూ ఒక పూర్తి ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు వివరించారు.

# తెలుగు వర్సిటీ ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

**నాంపల్లి, జులై 9, ప్రభాతవార్త:** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవే పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం సెంట్రల్ అడ్మి షన్స్ కమిటీ డైరెక్టర్ డా. వనజా ఉదయ్ తెలిపారు. జూలై 23న నాంపల్లి హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో బిఎస్ఏ, ఎంపిఏ డ్యాన్స్, ఎంపిఏ ఫోక్ ఆర్ట్స్ ఉదయం 11 నుండి 12గంటల వరకు; మధ్యాహ్నం 2 నుండి 3.30గంటల వరకు ఎంఏ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం కోర్సులలో చేరడానికి ప్రవేశ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. బిఎస్ఏ, ఎంపిఏ డ్యాన్స్, ఎంపిఏ ఫోక్‌ఆర్ట్స్ కోర్సులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు అదేరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో ప్రాయోగిక పరీక్షకు కూడా నిర్వహించనున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. బిఎస్ఏ ప్రాయోగిక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు డ్రాయింగ్‌బోర్డు, అవసరమైన పెన్సిళ్లను వెంట తీసుకొచ్చుకోవాలని సూచిం చారు. హాల్ టిక్కెట్లను జూలై 16 నుండి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. పిఎస్‌టియు సెట్.ఆర్గ్ (ఓఆర్‌జి) వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విశ్వవిద్యాలయం వెల్లడించింది. అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని అధికారులు సూచించారు.

# 'సర్' సందేహాలకు హెల్ప్ డెస్క్

## పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** బాగ్‌అంబర్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'సర్' హెల్ప్ డెస్క్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు,డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ శంభుల ఉషశ్రీశ్రీకాంత్‌గౌడ్ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా 'సర్'పై ఓటర్లకు ఉన్న సందేహాలు, సూచనలు, సలహాలు అందించారు. సర్ పత్రాలను నింపడానికి నేడు ప్రారంభించిన హెల్ప్‌డెస్క్‌ను ఉపయోగించు కోవాలని కోరారు. మన ఓటు మన హక్కు, మన ఓటు హక్కును మనమే కాపాడుకుందాం. ఈ యొక్క సదవకాశాన్ని ప్రజలందరూ తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు.

## ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ ఐడి పొందాలి

**వ్యవసాయ అధికారిరేణుక చక్రవర్తి**

**తలకొండపల్లి, జులై 9,ప్రభాత వార్త:** ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుని ప్రత్యేక యూనిక్ ఫార్మర్ ఐడి పొందాలని మండల వ్యవసాయ అధికారి, రేణుక చక్రవర్తిని సూచించారు. గురువారం నాడు మండలకేంద్రంలో రైతులతో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తలకొండపల్లి మండలంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని ఆమె తెలిపారు. మండలంలోని ప్రతి అర్హత కలిగిన రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుని ప్రత్యేక యూనిక్ ఫార్మర్ ఐడీ పొందాలని పేర్కొన్నారు.

వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, గ్రామాల వారీగా ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహిస్తూ రైతుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. నిర్ణీత గడువులోగా ఈ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు.రైతుల ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పట్టాదార్ పాస్‌బుక్ వివరాలను సేకరించి బయోమెట్రిక్ లేదా ఒటిపి ధృవీకరణ ద్వారా నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, పెట్టుబడి సహాయం, పంటల బీమా, సబ్సిడీలు, బ్యాంకు రుణాలు తదితర సేవలు ఫార్మర్ ఐడి ఆధారంగా అందించే విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.తలకొండపల్లి మండలంలో మొత్తం 24,066 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 16,849 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు పూర్తి చేసుకున్నారు. ఇంకా 7,217 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉంది. అంటే మండలంలో 70 శాతం మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయగా, 30 శాతం మంది రైతులు ఇంకా నమోదు చేసుకోవాల్సి ఉందనీ వారందరూ చేసుకోవాలని ఆమె సూచించారు.

## కేటగిరివారీగా వేతనాలు చెల్లించాలి



ఎంపిఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ,జులై 9,ప్రభాత వార్త:** ప్రభుత్వం గ్రామ పంచాయితీ కార్మికులకు కేటగిరి వారిగ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్యలు అన్నారు.గురువారం జిల్లేడు చౌదరి గుడా మండల ఎంపిడిఒ ఆఫీసు ముందు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయలేకపోయారని ఆయన విమర్శించారు. అధికారంలో ఉంటే ఒక మాట అధికారం లేకుంటే ఒక మాట వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు వేతనం పెంచడంలో ఈఎస్ఐ పీఎఫ్ కల్పించడంలో కానీ శ్రద్ధ చూపడం లేదని వారు అన్నారు. పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం చౌదర్ గూడా గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీవో ఆఫీస్ వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించి ఎంపిఓ హనుమంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు మండల అధ్యక్షులు జి రమేష్, మండల కార్యదర్శి ఫకీర్ అన్వర్, ఉపాధ్యక్షులు పాపయ్య, ఇదమ్మ, లక్ష్మయ్య, జంగయ్య, మల్లేష్, బాలమ్మ ,నర్సమ్మ, సరళ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు .

## ముటుపూర్‌లో సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే!




**కొందుర్గు, జులై 9, ప్రభాతవార్త :** ఓటర్ల సమగ్ర సర్వేను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు నిచ్చారు

గురువారం నాడు ఆయన మండల పరిధిలోని ముట్పూర్ గ్రామంలో ఓటర్ల సమగ్ర సర్వేపై ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు నేరుగా ఎమినరేషన్ పారాలను అందజేసి అవగాహన కల్పించారు. దేశంలో ఒకరికి చోట ఓటు ఉండాలని ఆశయంతోనే కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ ఓటర్ల సమగ్ర సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ సర్వేలో పాల్గొని అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. గ్రామాలలో చదువుకున్న యువకులు ఓటర్ల సమగ్ర సర్వే పారాలు పూర్తి చేయుటకు ఇబ్బంది పడుతున్నా ఓటర్లకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం అదే గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకా రైతు సేవ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనకమామిడి అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన, తహసిల్దార్ ఆజం అలీ, బి ఎల్ ఓ లు, పార్టీ నాయకులు పురుషోత్తం రెడ్డి, సయ్యద్ సాదిక్, కేకే కృష్ణ, జితేందర్ రెడ్డి, కొయ్యల నరసింహులు, మల్లేష్ గౌడ్, బొట్టు శీను, తో పాటు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**కేశంపేట, జులై9,ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి చెందిన నాగ పోగు పోచమ్మ గురువారం ఆకస్మికంగా మృతి చెందింది విషయం తెలుసు కున్న గ్రామ సర్పంచ్ పోచమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంత్యక్రియలు నిర్వహించేందుకుఆర్థిక సహాయంగా 5000 రూపాయలను అందజేశారు. ఈ సందర్బంగా మృతురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గొప్ప మనసుతో ఆర్థిక సహాయాన్ని అందించిన సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంధ్య శ్రీకాంత్ వార్డు సభ్యులు జంగయ్య గ్రామస్తులు శేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణతోనే పిల్లల సంపూర్ణ ఆరోగ్యం

**కొత్తూరు, జులై9,ప్రభాతవార్త :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గురువారం కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా డాక్టర్ దీప్తి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీప్తి సూచించారు. సోమవారం (జూలై 13) నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం, సందర్బంగా ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర అందించడం ద్వారా నులిపురుగుల సమస్యను నివారించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఓ, సీడీపీఓ, మండల పరిషత్ సూపరింటెండెంట్ సయ్యద్ మహమ్మద్ అలీ, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు డాక్టర్ సరిత, డాక్టర్ మనస, డాక్టర్ ఉదయ్ కిరణ్, సీహెచ్‌వో నాగేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు అత్యాధునిక ఫిజియోథెరపీ సేవలు



ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నవీన్ కుమార్ రెడ్డి

**కొత్తూరు,జులై 9, ప్రభాతవార్త:** ఆరోగ్య సమస్యలకు మందులతో పాటు ఫిజియోథెరపీ కూడా సమర్థవంతమైన చికిత్సా విధానంగా ప్రజలకు ఎంతో ఉపయోగపడు తుందని ఎమ్మెల్సీ నాగరికుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ పెంజర్ల రోడ్డులో డాక్టర్ మాదా రం మాధురి గౌడ్ (బీపీటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ నరసింహ ఫిజియోథెరపీ క్లినిక్‌ను ఎమ్మెల్సీ నాగరికుంట నవీన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, నరాల బలహీనత, కండరాల సమస్యలు, కీళ్ల నొప్పులు, ప్రమాదాల అనంతరం శారీరక కదలికలు కోల్పోయిన వారికి ఫిజియోథెరపీ ఎంతో ఉపయుక్తమని తెలి పారు. శస్త్రచికిత్సల అనంతరం, వృద్ధాప్య సమస్యలు, పక్షవాతం వంటి పరిస్థితుల్లో ఫిజియోథెరపీ ద్వారా శరీరానికి తిరిగి చురుకుదనం, బలం చేకూరి సాధారణ జీవనశైలికి చేరుకోవడం సులభమవుతుందన్నారు. ప్రజలకు నాణ్యమైన ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొంటూ, డాక్టర్ మాదారం మాధురి గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ డోలి రవీందర్, మాజీ కౌన్సిలర్లు మాదారం నరసింహ గౌడ్, అనిత శ్రీనివాస్ గౌడ్, మాధవి గోపాల్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు మాదారం అనురాధ కృష్ణ గౌడ్, జంగళ్ల కృష్ణయ్య, జనార్దన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎరుకలి విష్ణుమూర్తి, కిషన్ నాయక్, పరంధాములు గౌడ్, సాగర్, నాట్కో విష్ణు, అనిల్ తదితరులు పాల్గొన్నారు .



## ఎన్యుమరేషన్ ఫారాలు తప్పనిసరిగా నింపి బిఎల్ఓలకు అందజేయాలి

**..తహసిల్దార్ రాజేందర్ రెడ్డి**

**కేశంపేట, జులై 9, ప్రభాత వార్త:** జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఆర్ఐ) కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తహసిల్దార్ రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా సంబంధిత అధికారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ గురువారం కేశంపేట మండల పరిధిలోని, సంతాపూర్, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, కోనాయిపల్లి, అల్వాల గ్రామాలను సందర్శించినట్లు తెలిపారు .

గ్రామ ప్రజలందరూ ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూర్తిచేసి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు వెంటనే అందజేయాలని ఆయన తెలిపారు . ఫారం నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ పంచా యతీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న బూత్ లెవెల్ అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకుని ఫారాలను సమర్పించాలని తహసిల్దార్ తెలియజేశారు.

## ఓటును తప్పకుండా నమోదు చేసుకోవాలి

**తహసిల్దారు విజయ్‌కుమార్**




పూడూరు మన్నెగూడలో ఓటరు ఫాంలను నిపుతున్న విదానాన్ని పరిశీలిస్తున్న,తహశీల్దారు విజయ్‌కుమార్,అజీం పటేల్,తదితరులు

**పూడూరు, జులై 9, ప్రభాతవార్త :** గ్రామాల్లో నిర్వహించే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కార్యక్రమంలో ప్రతిఒక్క ఓటరు తమ ఓటును తప్పకుండా నమోదు చేసుకోవాలని తహశీల్దారు విజయ్‌కుమార్ పేర్కొన్నారు.ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు గురువారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడలో బిఎల్ఓ,బిఎల్ఎల సమక్షంలో సర్ హెల్పుడెస్క్ ఏర్పాటు చేసి,ఫారాలు నింపి ఓటర్లకు సహాయపడుతున్న కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల25వతేదీలోపల ఓటరు సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేసేవిధంగా సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శి అజీంపటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**బిజెపి రాష్ట్ర నాయకులు పెట్లోళ్ల విక్రమ్ రెడ్డి**

**మేడ్చల్, జులై 9. ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు భాగస్వామి కావడం అత్యంత ఆవస్యకమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు.

మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీలో బీజేపీ బూత్ అధ్యక్షుడు అవినాష్ చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఒక వ్యక్తికి ఒకే చోట మాత్రమే ఓటు ఉండేలా చూసుకోవడం, కొత్తగా అర్హత పొందిన యువత పేర్లు నమోదు చేయించడం, చిరునామా మార్పులు, ఇతర అవసరమైన సవరణలు చేయించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి



ఓటరు సవరణ పత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్,సీనియర్ బీజేపీ నాయకుడు రామన్న గారి శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, మల్లేష్ యాదవ్, నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, జకట బాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ జాబితాలో తప్పులు లేకుండా వ్రాయాలి

**వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్**

**మోమిన్‌పేట్, జులై 9. ప్రభాతవార్త:** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా వ్రాసి సమర్పించాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. గురువారం మోమిన్‌పేట్ మండలం ఎన్కతల, మొరంగపల్లి, వెల్‌చాల్ గ్రామాలలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా వ్రాసి స్థానిక బీఎల్ఓ లకు ఇవ్వాలని, ఒకవేళ ఏదైనా అర్థం కాకుంటే ఆయా గ్రామాల బీఎల్ఓ లను అడిగి పూరించాలని సూచించారు. ప్రస్తుతం ఒక వ్యక్తి, ఒకే ఓటు ఉండేందుకే ఈ ఎస్ఐఆర్ యొక్క ముఖ్యోద్దేశమని అన్నారు. కాబట్టి ప్రతి వ్యక్తి తమ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులకు తావు లేకుండా చూసుకొని ఇట్టి ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దబ్బుని వెంకట్, స్థానిక సర్పంచులు పటేల్ శ్రీకాంత్‌గౌడ్, అరుణ బిచ్చయ్య, నాయకులు దళితరత్న అవార్డు గ్రహిత బిచ్చయ్య, ఉపసర్పంచ్ రమేష్, తిరుపతిరెడ్డి, రమేష్ సాగర్, రఘుపతిచారి, రమేష్, ఆజం, అబ్బు, గోనయ్య ఆయా గ్రామాల పార్టీ నామకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ధరఖాస్తుల గురించి అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు.

# వేలాది మందికి వెలుగునిస్తున్న సుంకిరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం





**- ఆరు రోజుల్లో 5,200 మందికి పైగా లబ్ధిదారులునన**

**- 98 మందికి విజయవంతంగా**

**తలకొండపల్లి, జులై9,ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ప్రముఖ కంటి వైద్య సంస్థ శంకర నేత్రాలయ, చెన్నై వైద్య నిపుణులు నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రజల నుంచి అపూర్వ స్పందనను అందు కుంటోంది. తలకొండపల్లిలోని శ్రీదేవకి ఫంక్షన్ హాల్‌లో కొనసాగుతున్న ఈ శిబిరం ఆరవ రోజుకు చేరుకోగా, వేలాది మంది గ్రామీణ ప్రజలు సేవలను వినియోగించుకుంటున్నారు.

శిబిరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 5,200 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 3,170 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 2,038 మందికిపైగా ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేయడంతో పాటు 180 మంది కంటి శుక్లాల రోగులను శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఇప్పటికే మూడు రోజులుగా కొనసాగుతున్న కంటి శుక్లాల ఆపరేషన్లలో 98 మంది రోగులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఆరవ రోజు మాత్రమే దాదాపు వెయ్యి మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 650 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించారు. 430 మందికిపైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయగా, మరో 38 మంది కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు. అలాగే మూడో రోజు కొనసాగిన శస్త్రచికిత్సల్లో మరో 34 మంది రోగులకు విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించారు.ఈ సందర్బంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ మెగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ కంటి చికిత్సలను వాయిదా వేయాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో శంకర నేత్రాలయ వైద్య నిపుణుల సహకారంతో మొబైల్ సర్జికల్ యూనిట్ ద్వారా అత్యాధునిక సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.కంటి చూపు ప్రతి మనిషి జీవితంలో అమూల్యమైన వరమని, ఒకరికి చూపు తిరిగి ఇవ్వడం అంటే ఆ కుటుంబానికి కొత్త జీవితాన్ని అందించినట్లేనని ఆయన పేర్కొన్నారు. వేలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించడం, వేలాది మందికి ఉచిత కంటి అద్దాలు అందించడం, వందలాది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేయడం ఎంతో సంతృప్తిని కలిగిస్తోందన్నారు.

శంకర నేత్రాలయ వైద్యులు అత్యున్నత ప్రమాణాలతో చికిత్సలు అందిస్తున్నారని, ఇప్పటికే 98 మంది రోగులకు విజయవంతంగా కంటి శుక్లాల శస్త్రచికిత్సలు పూర్తయ్యాయని తెలిపారు. శస్త్రచికిత్సల అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని చెప్పారు.ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన తమపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్న ఆయన, ఐక్యత ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక సేవ రంగాల్లో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. రేపటితో ఉచిత కంటి పరీక్షలు ముగియనున్నందున ఇంకా పరీక్షలు చేయించుకోని వారు తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, కంటి శుక్లాల శస్త్రచికిత్సలు ఆదివారం వరకు కొనసాగుతాయని తెలిపారు.శిబిరాన్ని సందర్శించిన పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిగా ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు.

సాధారణంగా వేల రూపాయలు ఖర్చయ్యే కంటి శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించడం, కంటి పరీక్షలు, కంటి అద్దాలు పంపిణీ చేయడం గొప్ప సేవ అని కొనియాడారు. ప్రజాసేవను బాధ్యతగా భావిస్తూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వెంకట్రావుపేట్ సర్పంచ్ ఉమ్మడి మహేష్, గట్టిప్పలపల్లి సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్, గౌరిపల్లి సర్పంచ్ కళ్యాణ్ నాయక్, ఉపసర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, రాజేంద్ర రెడ్డి, మురళీ గౌడ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, విజయ్ కుమార్, రఘు, యాదయ్య, మల్లేష్, శ్రీపతి, శేఖర్, శ్రీను, భాస్కర్, సాయి కిరణ్, శంకర నేత్రాలయ వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నారపల్లిలో సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ నాయకుడు అయోధ్య రామయ్య తదితరులు.

## నారపల్లిలో సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కాంగ్రెస్ నాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 9, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వార్డు 8 నారపల్లి బూత్ నెంబర్ 367, 368 పరిధిలో కాంగ్రెస్ నాయకులు సర్ కార్యక్రమాన్ని గురువారం పర్యవేక్షించారు. బిఎల్ఒలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలలో సర్ కార్యక్రమంపై ఉన్న అపోహలను తొలగిస్తూ వారికి సహాయం చేస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు అయోధ్య రామయ్య తెలిపారు. సర్ కార్యక్రమంలో ప్రజలు తమ ఓటు హక్కుకు సంబంధించి పూర్తి వివరాలు ఫారంలో నింపి ఇవ్వాలని అన్నారు. సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన వారిలో కాంగ్రెస్ నాయకులు అయోధ్య రామయ్యతో పాటు జె. బాస్కర్, బండ్లగూడ ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా రాజకీయ పార్టీల ఐక్యత

**హెల్ప్ డెస్క్ ను పరిశీలించిన తహసిల్దార్ సాజిదా బేగం**



హెల్ప్ డెస్క్ ను పరిశీలిస్తున్న తహసిల్దార్ సాజిదా బేగం

**ధారూర్,జులై 9, ప్రభాత వార్త:** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు, ధారూర్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యా లయాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో హెల్ప్ డెస్క్ లను గురువారం ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్ డెస్క్ ల పనితీరును ధారూర్ తహసిల్దార్ సాజిదా బేగం స్వయంగా పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని ఈ డెస్క్‌ల వద్ద ప్రజలు ఫారమ్‌లను ఎలా నింపుతున్నారో ఆమె పర్యవేక్షి ంచారు. దరఖాస్తుల ప్రక్రియ వేగవంతంగా జరిగేలా సిబ్బందికి, అలాగే వారికి సహకరిస్తున్న రాజకీయ నాయకులకు ఆమె తగిన సూచనలు చేసి, వారి కృషిని అభినందించారు. ఈ సందర్బంగా మండలంలోని వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా ముఖ్య ఉద్దేశ్యమని , ఇతర అవసరాల కోసం కార్యాలయాలకు వచ్చే సామా న్యులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని ఉపయోగిం చుకుని, తమ పనులను సులభంగా పూర్తి చేసుకోవాలి అని వారు పిలుపునిచ్చారు. తహసిల్దార్‌తో పాటు డిప్యూటీ తహసిల్దార్ శ్రీలత, ఆర్ ఐ స్వప్న, నాయకులు తదితరులు ఉన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ దేవి రామ్‌చరణ్

## ఓటు హక్కును కాపాడుకోవాలి

**జిల్లెడు చౌదరిగూడ,జులై 9,ప్రభాత వార్త:** గ్రామంలోని ప్రతి ఒక్కరు సర్ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటు హక్కుకు కాపాడుకోవాలని జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చింతకుంట తాండ సర్పంచ్ దేవి రాంచరణ్ అన్నారు. గురువారం గ్రామంలో ఎన్యుమరేషన్ ఫారం నింపి ప్రజలకు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు వివరాలు తెలిపి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. ఎనుమరేషన్ ఫారాలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు 2002 ఓట్లను జాబితాలో ఉన్న వివరాలను అందించాలని సూచించారు. లేకపోతే మ్యాపింగ్ చేయడంలో అధికారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఓటర్కు అందించిన రెండు ఫారాలను నింపి ఒకటి ఫోటో అతిధించి బిఎల్ వరకు అందించాలని సూచించారు. ఫారాలు నింపడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న సిబ్బందికి అందించాలని కోరారు. గడువులోగా ఓటర్లు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఎల్వోలు నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్త వసంత, బిల్‌పే వినోద్ నాయక్, గ్రామస్తులు రాంచరణ్, ఆదిత్య, అనీల్, తులసీ రాం, హన్మంత్, సేవ్య, శివరాం, గోవింద, మంగ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు

**దౌల్తాబాద్, జులై 9,ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండలంలోని సురాయిపల్లి,సలీంపూర్ గ్రామాల్లో ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్బంగా హెచ్ఇఒ భావ్య నాయక్ మాటా డుతూ..ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న సబ్సిడీలు, మార్కెటింగ్ సౌకర్యాలు,డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులపై రైతులకు వివరించారు.ముఖ్యంగా అడవి పందుల బెడద నుంచి పంటను రక్షించు కోవడానికి,పొలం చుట్టూ రక్షణగా వెదురు మొక్కలను ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంతే కాకుండా, కూరగాయల సాగు చేస్తున్న రైతుల వివరాలను నమోదు చేసుకున్న అధికారులు,ప్రభుత్వం నుంచి అందే రాయితీల గురించి వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున్ ,గ్రామ ఉప సర్పంచ్ అనంతయ్య,రైతులు వెంకటయ్య,విష్ణుమోహన్ రెడ్డి,రొయ్యల నారాయణ,రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## బుకింగ్ ఓటిపిని వారం రోజులు పెంచండి

**మండల సర్పంచుల సంఘం మాజి అధ్యక్షులు**

**దోమ,జులై 9, ప్రభాతవార్త:** యూరియా బుకింగ్ ఓటిపిని వారం రోజులు పెంచాలని దోమ మండల సర్పంచుల సంఘం మాజి అధ్యక్షులు కె.రాజిరెడ్డి అన్నారు.ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూరాష్ట్ర వ్యవసాయశాఖ మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ చేసు కోవచ్చని తెలుపడం జరిగిందనితెలిపారు.యూరియా బుకింగ్‌చేసిన సమ యములో ఓటిపి కేవలం రెండు రోజులు మాత్రమే ఉంటుందని అన్నారు. దీనివలన ఫర్టిలైజర్‌లో డీలర్ల దగ్గర యూరియా నిల్వలు అందుబాటులో లేకుంటే బుకింగ్ రద్దుఅవుతుందని అన్నారు.రైతులు మళ్ళీ మీసేవా కేంద్రాలకు వెళ్లితిరిగి బుకింగ్ చేసుకోవడం వల్ల రైతులు ఇబ్బం దులు పడి కేంద్రాల చుట్టు తిరుగుతున్నారని తెలిపారు. పొలాల్లో పనులు చేసుకోవలసిన రైతులు మీసేవా కేంద్రాల చుట్టు తిరగవలసి వస్తుందని ఈ విషయాన్ని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించి రైతులకుయూరియా సులువుగా వచ్చేవిదంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# శ్రీవారి ఆలయ నిర్మాణ పనుల నాణ్యతలో రాజీపడొద్దు



**కొడంగల్,జులై 9,ప్రభాతవార్త:**
కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడోద్దని రెరా డైరెక్టర్,శ్రీవారి ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసరాజు అన్నారు.గురువారం కొడంగల్ వచ్చిన ఆయన శ్రీవారి ఆలయ నిర్మాణ పనులను దాదాపు 2 గంటలకు పైగా పరిశీలించారు.ఆలయ సమీపంలో నిర్మాణం కోసం తీసుకొని శిలల్లోని డిజైన్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు.శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న స్ధలం ఎంత ఉంది.ఇంకా ఎంత మేర సేకరించాల్సి ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు.స్ధానిక ప్రజలకు ఎక్కడ ఇబ్బంది పడకుండా జాగ్రత్త తీసుకోవాలని,ప్రతి ఒక్కరిని ప్రేమతో ఒప్పించి స్ధల సేకరణ చేయాలని సూచించారు.శిలలు చెక్కుతున్న శిల్పులు ఏ ఆలయాలను నిర్మాణం చేశారని అడిగి తెలుసుకున్నారు.ప్రతి శిల్పికి ఎన్నో ఆలయాల నిర్మాణాల్లో పాల్గొన్న అనుభవం ఉందని తెలిపారు.అనంతరం పురాతన గాడిబాయి శివా లయం,అక్కడే ఉన్న అంజనేయస్వామి ఆలయంను పరిశీలించారు.అత్యంత పురాతనమైన ఆ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అక్కడే ఉన్న అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్ధపతి ప్రసాద్,లక్ష్మీనారాయణ.సీఈ వసంత్‌నాయక్,సీఈఓ శివనాగిరెడ్డి,మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,ఈఈ శ్రీధర్‌రెడ్డి,డీఈ సురేందర్,ఏఈ శ్రీకాంత్‌రెడ్డి,కాంట్రాక్టర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గుట్కాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



**కొడంగల్,జులై 8,ప్రభాతవార్త:**
నిషేదిత గుట్కాలను విక్రయిస్తే కేసుల నమోదుతో కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు.గురువారం కొడంగల్ పట్టణంలోని పలు పాన్‌షాపుల్లో సీఐ శ్రీధర్‌రెడ్డి,ఎస్సై జీవీ.సత్యనారాయణలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా యువత జీవితాలను నాశనం చేసే గుట్కాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు.

**పాన్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ,ఎస్సై**

# విద్యార్ధులకు నాణ్యమైన విద్యనందించాలి

**చేవెళ్ల,జులై 9, ప్రభాతవార్త:**
మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యర్ధులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యసంస్ధలు పనిచేయాలని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మహర్షి విద్యాలయ భవనాన్ని గురువారం చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంబించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడతూ చేవెళ్లలో కార్పోరేట్ స్థాయి వసతులతో విద్యా సంస్ధలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు.పుస్తకాలకే పరిమితమైన విద్య కాకుండా విద్యార్ధులను సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్ధులకు కూడా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహర్షి విద్యాలయం చేవెళ్ల ప్రాంతంలో మంచి గుర్తింపు సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో పోల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి,చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాముగౌడ్,కౌన్సిలర్‌లు గోపాల్‌రెడ్డి, బండారు శైలజ ఆగిరెడ్డి,పాఠశాల చైర్మన్ చిరుమని జైపాల్‌రెడ్డి,కరస్పాండెంట్ ప్రభాకర్,ముడిమ్యల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి,మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, మదుసూదన్‌గుప్తా,పడాల ప్రభాకర్,చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు శ్రీని వాస్ గౌడ్,నాయకులు గిరిధర్‌రెడ్డి,మండల పార్టీ అద్యక్షుడు వీరేందర్‌రెడ్డి,షాబాద్ మార్కెట్ చైర్మన్ సురేందర్‌రెడ్డి,చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్,వైస్ చైర్మన్ రాములు తదితులు పాల్గోన్నారు.



**చేవెళ్ల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మహర్షి విద్యాలయ భవనాన్ని ప్రారంబించిన చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య**

# పిఎం శ్రీజడ్పీ హెచ్‌ఎస్ తూంకుంటలో 100కు చేరిన ప్రవేశాలు




**పిఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల తూంకుంటలో కొత్తగా ప్రవేశాలు వందకు చేరటంతో హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయుల, విద్యార్థుల దృశ్యం**

**..నాణ్యమైన విద్యపై తల్లిదండ్రుల విశ్వాసం**

**శామీర్‌పేట, జులై 9, ప్రభాతవార్త:** పిఎం శ్రీ జడ్పీ హెచ్‌ఎస్ తూంకుంట పాఠశాలలో కొత్తగా పిల్లల 100 ప్రవేశాలు జరగటం, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు విశ్వాసం పెరిగినందునే ప్రవేశాలు పెరిగినట్లు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026-2027 విద్యాసంవత్సరంనకు సంబంధించి పిల్లల ప్రవేశాలు కొత్తగా 100కు చేరటం సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల గత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 98శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ఫలితాలను నమోదు చేసింది. నాణ్యమైన బోధన, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, క్రమశిక్షణ ఈ విజయానికి కారణాలు అని తెలిపారు. పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్స్, అత్యాధునిక సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటిఎల్), వృత్తి విద్య (వొకేషనల్ కోర్సు), యోగా తరగతులు, క్రీడలు, వివిధ సహ పాఠ్యకార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పిఎం పథకం ద్వారా ఆధునిక విద్యా సౌకర్యాలు, అనుభవాత్మక బోధన, సాంకేతిక విద్యకు ప్రాదాన్యం ఇవ్వబడుతుందన్నారు. ఈ సౌకర్యాల వల్లనే తల్లిదండ్రులు పాఠశాలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను పెద్ద సంఖ్యలో చేర్పిస్తున్నారు. ప్రవేశాలు ఇంకా కొనసాగుతునందున నాణ్యమైన ప్రభుత్వ విద్యను కోరుకునే తల్లిదండ్రులు తమ పిల్లలను పిఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్ తూంకుంటలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు కోరారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్వాగతించారు.

# పారదర్శకతతోనే గ్రామసర్వే నిర్వాహణ

**..నాగిశెట్టిపల్లిలో గ్రామ సర్వే-భూసంబంధిత సమస్యలపై గ్రామసభ**

**శామీర్‌పేట, జులై 9, ప్రభాతవార్త:**గ్రామ సర్వే ప్రక్రియ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే పూర్తి స్థాయి పారదర్శకతతో నిర్వహించబడుతుందని కీసర ఆర్డీఓ ఎన్.వెంకట్‌రెడ్డి వివరించారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని నాగిశెట్టిపల్లి గ్రామంలో గ్రామ సర్వే-.భూసంబంధిత సమస్యలపై నిర్వహించచన గ్రామ సభలో కీసర ఆర్డీఓ ఎన్.వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్, ఎంసిపల్లి మున్సిపలన చైర్మన్ జాము రవి, శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్ నవీన్‌నాయక్, మాజీ సర్పంచు కృపాకర్‌రెడ్డి, మండల సర్వేయర్, గిర్దావర్లు, జిపిఓలు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీసర ఆర్డీఓ ఎన్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ సర్వే కార్యక్రమం లక్ష్యాలు, ప్రాముఖ్యతను గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామస్థులు వ్యక్తం చేసిన భూ సంబంధిత సమస్యలు, అభ్యంతరాలు, సందేహాలను ఓర్పుగా విని వాటిపై స్పష్టంగా ఆయన వివరించారు. గ్రామ సర్వే పూర్తి చేయటానికి గ్రామస్థులు అధికారులకు సహకరించాలన్నారు. గ్రామ సర్వే ద్వారా భూరికార్డులలో పారదర్శకత పెరిగి భూ వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. గ్రామస్థులు రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



**నాగిశెట్టిపల్లి గ్రామంలో గ్రామ సర్వే-భూసమస్యలపై గ్రామసభలో పాల్గొన్న కీసర ఆర్డీఓ వెంకట్‌రెడ్డిని సన్మానించిన ఎంసిపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్,తదితరుల దృశ్యం**

# రోడ్డు ప్రమాద బాధితురాలికి బి ఆర్ ఆర్ ఆర్థిక సహాయం

**యాచారం,జులై9, ప్రభాతవార్త:** యాచారం గ్రామ పంచాయతీ సిబ్బంది కంబాలపల్లి రామచంద్ర కుమార్తె మాధవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ప్రమాదం అనంతరం ఆమెకు వైద్య చికిత్స తీసుకొని ఆసుపత్రి నుండి డిచార్జ్ అయ్యింది. చికిత్స అనంతరం ఖర్చులు భరించలేక కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం స్థానికంగా తెలిసిన వెంటనే బిఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి మానవత్వంతో స్పందించారు. మాధవి కుటుంబ పరిస్థితిని స్వయంగా తెలుసుకున్న బూడద రామ్ రెడ్డి, ఆమె వైద్య చికిత్సకు తోడ్పాటుగా రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ఆ ఫౌండేషన్ కమిటీ సభ్యుల ద్వారా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు.ఈ ఆర్థిక సహాయం అందుకోవడంతో మాధవి కుటుంబ సభ్యులు బూడిద రామ్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టకాలంలో ఆదుకున్న ఆయన సేవాభావాన్ని వారు కొనియాడారు. స్థానిక ప్రజలు కూడా బిఆర్‌ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, అవసరంలో ఉన్న వారికి ఇలాంటి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజాసేవే లక్ష్యంగా బిఆర్‌ఆర్ ఫౌండేషన్ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో పేదలకు చేయూతనిస్తూ సమాజంలో మంచి గుర్తింపు పొందుతోందని స్థానికులు తెలిపారు. ఈ ఘటన మరోసారి ఫౌండేషన్ సేవా దృక్పథాన్ని చాటిందని వారు అభిప్రాయపడ్డారు.



# రాక్‌బాల్ క్రీడాకారుడు గోపాల్‌కు ఎమ్మెల్యేల సన్మానం

**మేడ్చల్, జూలై 9,ప్రభాతవార్త:** దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన భారత జట్టు సభ్యుడు, మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన క్రీడాకారుడు ఇటబోయిన గోపాల్ యాదవ్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు.

గురువారం ఎమ్మెల్యేల ఇంటికి గోపాల్ యాదవ్ మర్యాద పూర్వకంగా వెళ్లి కలివగా వారు సత్కరించి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గోపాల్ ప్రతిభ అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కోచ్ లక్ష్మణ్, మాజీ జిల్లా గ్రంథాలయాల చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యులు నవీన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రఘు, నాయకులు వెంకటేష్, శేఖర్ రెడ్డి, యువకులు లక్ష్మణ్ యాదవ్, అనిల్ యాదవ్, పరమేశ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



**మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన క్రీడాకారుడు గోపాల్ యాదవ్**

# ఎరువుల కొనుగోలులో రైతులకు తప్పని తిప్పలు



**యాచారం,జులై9, ప్రభాతవార్త:**
యాచారం మండల పరిధిలోని రైతు ఎరువుల బుకింగ్ విషయంలో సరైన సమాచారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కోరే జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా యూరియా ఎప్పుడు వస్తుంది? బుకింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుంది? అనే విషయాలపై స్పష్టత లేక రైతులు అయోమయంలో ఉన్నారని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామానికి వెళ్లి రైతులకు ఎరువుల బుకింగ్ విధానం, యూరియా సరఫరా వివరాలు మరియు సంబంధిత నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు.రైతులకు సకాలంలో సరైన సమాచారం అందేలా చర్యలు తీసుకొని, ఎరువులు కూడా సమయానికి అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# డంపింగ్ యార్డ్ ఆందోళనలు శాంతియుతంగా నిర్వహించాలి

**చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ సైదులు**

**జవహర్‌నగర్,జులై 9. (ప్రభాత వార్త):**
జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ అంశంపై చేపట్టే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు శాంతియుతంగా మరియు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని జవహర్‌నగర్ సీఐ సైదులు విజ్ఞప్తి చేశారు.ఇటీవల వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల్లో డంపింగ్ యార్డ్‌కు సంబంధించిన వాహనాలను అడ్డుకుంటామని, ఇతర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనలను వ్యక్తం చేయడం ప్రతి ఒక్కరి హక్కేనని, అయితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు.డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనే ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వాహనాల రాకపోకలను అడ్డుకోవడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలు చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు.



ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సైదులు హెచ్చరించారు.డంపింగ్ యార్డ్ అంశంపై తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుత మార్గంలో తెలియజేయాలని, ప్రజల సహకారంతో శాంతి భద్రతలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మోత్కుపల్లి గ్రామంలో నూతన కమిటీ ఎన్నిక

**కోట్‌పల్లి, జులై 9,ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తేనె రాంచెంద్రరెడ్డి అధ్వర్యంలో నూతన గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా యండి, ఖాజా, ఉపాధ్యక్షులు సూరని సురేష్‌లను ఎన్నికున్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు తేనె రాంచెంద్రరెడ్డి, మాట్లాడుతూ. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల తరపున నిరంతరం పోరాడాలని వారు సూచించారు. నూతన గ్రామ కమిటీ సభ్యులను అభినందిస్తూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి, నర్సింహరెడ్డి, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బైండ్ల నారాయణ, బాల్‌రాజ్, దుర్గంచెర్వు పాండు, జనార్ధన్‌గౌడ్, కావలి గోపాల్, బైండ్ల సురేందర్, అశోక్, మొల్లయ్య, రంగారెడ్డి, విలాస్‌రెడ్డి, వార్డు సభ్యులు అమీర్ పటేల్, హైమాద్, తదితరులు పాల్గోన్నారు,



**మోత్కుపల్లి గ్రామంలో నూతన గ్రామ కమిటీ ఎన్నికలో మాట్లాడుతున్న నాయకులు,**



**జండా ఎగురేస్తున్న నాయకులు**



**వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎబివిపి నాయకులు**

## ఘనంగా ఎబివిపి ఆవిర్భావ దినోత్సవం

**కడ్తాల్, జులై 9,ప్రభాత వార్త:**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అవిర్భావ దినోత్సవాన్ని కడ్తాల్ మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై ఏబీవీపీ రాష్ట్ర నాయకులు క్యామ శ్రీకాంత్, నేనావత్ పవన్ లు ఏబీవీపీ జెండాను ఆవిష్కరించి 78వ ఆవిర్భావ దినో త్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1949 జూలై 9న ఓంప్రకాష్ బేహల్ అనే ప్రొఫెసర్ అతికొద్ది మందితో స్థాపించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అనధికాలంలోనే మహాశక్తిగా ఎదిగి పెద్ద విద్యార్థి సంఘంగా అవతరమి చ్చిందని ఆయన అన్నారు. విద్యారంగ సమస్యలపైనే ఉద్యమాలు కాకుండా సామాజిక సమానత్వమే ధ్యేయంగా విద్యార్థులకు దేశ భక్తిని పెంపొందించే విధంగా కృషి చేస్తుందని, ప్రతి విద్యార్థి అవినీతి రహిత సమాజం కోసం పాటు పదాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దోనోదుల మహేష్, భగీరథ్, రవీందర్ రెడ్డి, సిద్ధి గారి కుమార్, ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎ బి వి పి ఆవిర్భావ వేడుకలు

**తలకొండపల్లి జులై 9,ప్రభాత వార్త:**
తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం ఎ బి వి పి ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్థానిక వివేకానంద విగ్రహము వద్ద జండా ఎగురవేసి వేడుక నిర్వహించారు.ఈ కార్యక్రమములో ఎ బి విపి నాయకులు వెంకటేష్ నాయక్,విజయ్ కుమార్,కృష్ణ,శ్రీకాంత్,సిద్దు దేవేందర్ లు ఉన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎబివిపి ధ్యేయం

**ఆమనగల్లు, జులై9, ప్రభాతవార్త:** విద్యారంగంలో ప్రధానంగా ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు ఏబివిపి అలుపెరుగని పోరాటం చేస్తుందని ఏబివిపి పూర్వ సీనియర్ నాయకులు శ్రీకాంత్‌సింగ్, ఎర్రవోలు మహేశ్, వరికుప్పల శ్రీను, హిందూ శ్రీశైలం, లండం మల్లేశ్ అన్నారు. ఏబివిపి చేసిన పోరాట ఫలితం మూలంగా ప్రభుత్వాలు స్పందించి విద్యార్థులకు దక్కవలసిన హక్కులను సాధించినట్లు వారు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఏబివిపి 78వ ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా ఆమనగల్లు పట్టణంలో గురువారం విద్యార్థులతో కలిసి ఏబివిపి నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని స్వామి వివేకానందస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏబివిపి జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ఏబివిపి ఆశయాలు, సిద్ధాంతాలు నాణ్యమైన విద్య, బలోపేతమే లక్ష్యమన్నారు. ఏడు దశాబ్దాలుగా అనేక సమస్యలపై పోరాడిన చరిత్ర అఖిల భారత విద్యార్థి పరిషత్‌కు దక్కుతుందన్నారు.కార్యక్రమంలో పురుగుల శివ, లండం మల్లేశ్, గోరటి భరత్, నరేష్‌గౌడ్, ఎడవల్లి అంజి, సుమన్‌నాయక్, అఖిల్‌నాయక్, శివచారి, సాయి, చరణ్, గణేశ్, రాఘవ తదితరులు ఉన్నారు.

**నగర కార్యదర్శిగా చెన్నంచెట్టి మల్లేశ్ ఏకగ్రీవం....**

ఆమనగల్లు నగర కార్యదర్శిగా చెన్నంచెట్టి మల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఏబివిపి 78వ ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా మల్లేశ్‌ను ఏకగ్రీవంగా నియమించారు. ఈసంధర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వర్తించి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

## కొడంగల్‌లో ఎబివిపి భారీ ర్యాలీ



**కొడంగల్‌లో ఏబీవీపీ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు**

**కొడంగల్,జులై 9,ప్రభాతవార్త:**
అఖిలబారత విద్యార్ధి పరిషత్(ఏబీవీపీ) 78వ అవిర్భావ దినోత్సవం,జాతీయ విద్యార్ధి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొడంగల్ పట్టణంలో భారీ విద్యార్ధి ర్యాలీ నిర్వహించారు.స్ధానిక పాఠశాలల నుంచి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది.ఈ సందర్బంగా విద్యార్ధులు ఏబీవీపీకి అనుకూలంగా నినాదాలతో హోరెత్తిస్తు భారీ నిర్వహించారు.అనంతరం ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్ధుల సమస్యల సాధనకై ఏబీవీపీ అలుపెరగని పోరాటం చేస్తున్నదని అన్నారు.